విలువలతో కూడిన విద్యను అందించాలి

ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ

డీఐవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపక బృందం

మంగపేట, ఆగస్టు 13 : విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్య అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డీ చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని ఎక్కటి సరోజని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆమె సందర్శించారు. జిల్లాకు బదిలీపై వచ్చి మొదటి సారి కాలేజీని సందర్శించిన డీఐవోను ప్రిన్సిపాల్ వీరేందర్, అధ్యాపక బృందం సన్మానించింది. ముందుగా ఆమె అధ్యాపకుల హాజరు రిజిస్టర్లు, కాలేజీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తన, నడవడికలో మార్పులు వచ్చి సన్మార్గంలో పయనించేలా చేయడమే లక్ష్యంగా విద్యా బోధన కొనసాగాలని కోరారు. వ్యవస్థాగతంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థుల నమోదు, హాజరు శాతాన్ని పెంచాలని, ఇందుకుశక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు.

రెన్యువల్ చేయాలని గెస్ట్ లెక్చరర్ల వినతి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న తమను రెన్యువల్ చేయడంతో పాటు, కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీల కారణంగా డిస్టర్బ్ అయిన గెస్ట్ లెక్చరర్లను మరొకచోట సర్దుబాటు చేయాలని కోరుతూ అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంతెన చిరంజీవి డీఐవోకు వినతి పత్రం ఇచ్చారు. త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆమె చెప్పారు. కార్యక్రమంలో లెక్చరర్లు కే రజిత, జే జ్యోతిర్మయి, వై రేణుకాదేవి, ఎం సంతోష్‌కుమార్, ఎం లక్ష్మణ, పీ అనీల్‌కుమార్, జే రవీంద్రనాయక్, శ్రీనివాస్, వందన, వైష్ణవి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యంతోనే విద్యార్థికి విద్యుత్ షాక్

విద్యార్థి సంఘాల నాయకులు

ములుగురూరల్, ఆగస్టు 13 : గోవిందరావుపేట మండలం కర్లపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి నీరటి ముకేశ్ విద్యుదాఘాతానికి గురి కావడం హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యంతోనే జరిగిందని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు టీఎల్ రవి, రత్నం, ప్రవీణ్ అన్నారు. మంగళవారం ములుగు ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యుదాఘాతానికి గురైన విద్యార్థిని ములుగు ప్రభుత్వ దవాఖానలో జాయిన్ చేసి వెళ్లారని, హెచ్‌ఎం, వార్డెన్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి హెచ్‌ఎం, వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. హాస్టల్‌లో విద్యుత్‌కు సంబంధించిన మరమ్మతులు చేపట్టి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేదంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

డీఎంహెచ్‌వో మధుసూదన్

కాటారం : మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కాటారం/ పలిమెల, ఆగస్టు 13 : వైద్యులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమష్టిగా కృషి చేయాలని డీఎం హెచ్‌వో మధుసూదన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. కాటారం పీహెచ్‌సీ, పలిమెల మండలం పంకెన సబ్ సెంటర్‌లో పంకెన, పలిమెల, నీలంపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల వైద్య, ఆరోగ్య సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంతకు ముందు సబ్ సెంటర్లలోని రికార్డులను తనిఖీ చేసి ఖచ్చితంగా వివరాలు నమోదు చేయాలని సూచనలు చేశారు. పలిమెల మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కింద గుర్తించినందున ఒక్కొక్క ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో జనాభా ప్రాతిపదికన అన్ని రకాల సేవలను అందించి వారి టార్గెట్లను చేరుకోవాలన్నారు. గర్భిణుల నమోదు మొదటి 12వారాల లోపే నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలనిస సూచించారు. దోమల నివారణకు మందును పిచికారీ చేయాలని, మురుగు నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలన్నారు. పంచాయతీరాజ్, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పారిశుద్య నిర్వాహణ, డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో అవసరమైన మందులు, ఇతర పరికరాల వివరాలు అందజేయాలనారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శ్రీదే, చిరంజీవి, ఎపిడామాలజిస్ట్ బాష్యా నాయక్, డీపీవోలు చిరంజీవి, మౌనిక, రఘురామన్, వెద్యాధికారి మౌనిక, వెద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అధికారులు

తాడ్వాయి, ఆగస్టు 13 : మండలంలోని లింగాల గ్రామపంచాయతీలో మంగళవారం పోడు భూమిలో వేసిన మక్కజొన్న పంటను అటవీశాఖ అధికారులు ట్రాక్టర్లతో దున్ని ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన గిరిజన మహిళా రైతులు సాంబలక్ష్మి, వెంకటమ్మ గత పదేళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్నారు. ప్రతిసారి లాగే ఈసారి కూడా సుమారు ఐదెకరాల పోడు భూమిలో మక్కజొన్న విత్తనాలను వేశారు. మొక్కలు ఏపుగా పెరిగాయి. మంగళవారం మధ్యాహ్నం ఎలాంటి కారణాలు, గిరిజన మహిళా రైతులకు సమాచారం లేకుండా ట్రాక్టర్లతో దున్ని పంటను ధ్వంసం చేశారు. సాయంత్రం పంటలను చూసేందుకు వచ్చిన వారు పంట నాశనం చేయడంతో అటవీ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రూ.40వేలు ఖర్చు చేసి పంటను సాగు చేస్తే అధికారులు పంటను దున్నివేయడంతో కన్నీరు మున్నీరు అయ్యారు.

జాతీయ జెండాలతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

జాతీయ జెండాలతో ర్యాలీ తీస్తున్న సీఆర్పీఎఫ్ పోలీసులు

వాజేడు, ఆగస్టు 13 : మండలకేంద్రంలో మంగళవారం C/39 బెటాలియన్ సీఆర్పీఎఫ్ పోలీస్ బలగాలు జాతీయ జెండాలతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని పోలీస్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. బెటాలియన్ అసిస్టెంట్ కమోండెంట్ సతీశ్‌కుమార్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

కెనాల్ నిర్మాణ స్థల పరిశీలన

కాటారం, ఆగస్టు 13 : మండలంలోని వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్టు చెరువు పనుల నిర్వహణ సంస్థ ఇరిగేషన్ అధికారులతో కలిసి అటవీ అధికారులు మంగళవారం పరిశీలించారు. చెరువు విస్తరణ, కెనాల్ నిర్మాణం కోసం ఉద్దేశించిన భూములను సర్వే చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గోవిందరావుపేట : లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న లక్ష్మీనర్సింహారావు

గోవిందరావుపేట/తాడ్వాయి, ఆగస్టు 13 : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మంగళవారం ఆయన గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ పాలనలో సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఖర్చు పెట్టిన దానిలో యాభైశాతం కంటే ఎక్కువ ఇచ్చేవారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చాలా తక్కువగా సాయం అందిస్తున్నారని అన్నారు. ఏజెన్సీలో 70శాతం మంది రైతులకు రుణ మాఫీ జరగలేదన్నారు. ఈ విషయంపై త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. గోవిందరావుపేట మండలంలోని దుంపిల్లగూడెంకు చెందిన కట్టమ్మ, వినయ్, అంజలి, పాపయ్యపల్లికి చెందిన రాజు, గాంధీనగర్‌కు చెందిన నిర్మలమ్మ, పస్రానాగారానికి చెందిన విజయలక్ష్మి, మండలకేంద్రానికి చెందిన అప్సర్, కర్లపల్లికి చెందిన రాజేశ్వరీలకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. గోవిందరావుపేటలో మాజీ ఎంపీటీసీ వెలిశాల స్వరూప, రైతు బంధు సమితి మాజీ కోఆర్డినేటర్ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఊట్ల పృధ్వీరాజ్, లకావత్ చందూలాల్, హనుమంతరావు, సాంబయ్య, రవీంద్రరావు, బాబర్, రమేశ్, శ్రీనివాసాచారి, మధు, మోహన్, పక్రుద్దీన్, ప్రసాద్, ఇంద్రారెడ్డి, పురుషోత్తంచారి, కృష్ణ, తాడ్వాయిలో మండలపార్టీ అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రమణయ్య, నాయకులు మోహన్‌రావు, గోపాల్‌రెడ్డి, శేషగిరి, మహేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన లక్ష్మీనర్సింహారావు

ములుగురూరల్ : ములుగు కలెక్టర్ టీఎస్ దివాకరను మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి కలిసిన సందర్భంగా కలెక్టర్‌కు ఆయన మొక్కను అందించి పలు సమస్యలను వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ములుగురూరల్ : జంగాలపల్లి గ్రామానికి చెందిన పెండెల రవి ఇటీవల డెంగ్యూతో మరణించాడు. ఆయన కుటుంబాన్ని లక్ష్మీనారాయణరావు పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. మండల కోఆర్డినేటర్ పాలెపు శ్రీనివాస్, కాకులమర్రి ప్రదీప్‌రావు, మోహన్, భాస్కర్, చిట్టిబాబు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక ఇస్తున్న రఘుపతిరావు, పక్కన మాజీ ఎమ్మెల్యే గండ్ర

హెల్ప్ లైన్ సెంటర్‌ను సందర్శించిన గండ్ర

కృష్ణకాలనీ, ఆగస్టు 13 : ప్రభుత్వం చేసిన రూ.లక్ష, రూ.1.50 లక్షల వరకు రైతు ఋణ మాఫీ కానీ వారి కోసం బీఆర్‌ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన వాట్సాప్ హెల్ప్ లైన్ సెంటర్‌ను మంగళవారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సందర్శించారు. జిల్లాలో అర్హులైన రైతుల వివరాలు తెలుసుకొని, రుణమాఫీ ఎందుకు కాలేదో తెలుసుకున్నారు. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభారఘుపతిరావు కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను మాజీ మంత్రులు కేటీఆర్, సత్యవతిరాథోడ్‌కు ఇచ్చి ఆహ్వానించారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

శ్రీనివాస్‌కు సింగరేణి జీఎం అభినందన

శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సింగరేణి జీఎం

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 13: భూపాలపల్లి కేటీకే-1 ఇంక్లైన్‌లో పనిచేస్తున్న అడిచెర్ల శ్రీనివాస్‌ను జీఎం అబీబ్ హుస్సేన్ మంగళవారం అభినందించారు. హైదరాబాద్ తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 10, 11 తేదీల్లో నిర్వహించిన నృత్య రంగ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నల్ల వజ్రం కీర్తి పురస్కారాన్ని అందించారు. ఇందులో భాగంగా శ్రీనివాస్‌ను ఎంపిక చేసి నల్ల వజ్రం కీర్తి పురస్కారాన్ని అందించారు. దీంతో ఆయన జీఎంను కలువగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం రవికుమార్, డీవైపీఎం రాజు, స్పోర్ట్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక లాభాల్లో వాటా ఇవ్వాలి

భూపాలపల్లి రూరల్ : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వార్షిక ఉత్పత్తిలో వచ్చే లాభాల్లో వాటా ఇవ్వాలని కోరుతూ సింగరేణి జీఎం అబీబ్ హుస్సేన్‌కు ఎస్‌సీసీడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు అతి తక్కువ వేతనాలకు పనిచేస్తూ ఎక్కువగా శ్రమిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని జీఎంను కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందు అశోక్, రాష్ట్ర నాయకులు ఈ నరేశ్, తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ చంద్రగిరి శంకర్, ఎస్‌సీసీడబ్ల్యూ నాయకులు రమేశ్, సమ్మక్క పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఈటల రాజేందర్

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఉండాలి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

ములుగురూరల్, ఆగస్టు 13 : ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండా ఉండాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన హర్‌ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీకి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు జాతీయ జెండాను ఇండ్లపై ఏర్పాటు చేయాలని సూచించారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలైనా అర్పించడానికి ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంనాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, సురేందర్, రమేశ్, రవీంద్రాచారి, కృష్ణాకర్‌రావు, గాదం కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

దాడిపై విచారణకు ఆదేశాలు

ఏటూరునాగారం, ఆగస్టు 13 : తనకు జరిగిన అన్యాయంపై ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను వేడుకోగా స్పందించినట్లు మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షుడు కొండగొర్ల రాజేశ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి 1న మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో మూఢ నమ్మకాలపై దళిత బహుజనులతో ఏర్పాటు చేసుకున్న వేదిక వద్దకు కొంత మంది వచ్చి తనపై దాడి చేయడంతోపాటు కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారని, ఈ విషయంలో పోలీసులు కూడా తనకు సహకరించకుండా కులం పేరుతో ధూషించారని, తనను భయభ్రాంతులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు రాజేశ్ తెలిపారు.

ఈ మేరకు స్పందించిన కమిషన్ విచారణకు సిద్ధమైనట్లు రాజేశ్ తెలిపారు. తన వినతిపై స్పందించిన కమిషన్‌కు ఈ సందర్భంగా రాజేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కమిషన్ ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

విరాళాలు సేకరిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల (మొగుళ్ళపల్లి), ఆగస్టు 13 : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మంగళవారం రంగాపురం గ్రామంలో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ కమ్యూనిటీ లో భాగంగా సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించగా డీఎస్పీ హాజరై మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఒక్క రోజే రూ.2 లక్షలు ఇచ్చిన దాతలను ఆయన అభినందించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ట్రాక్టర్ యూనియన్, కిరాణా షాప్ యజమానులు పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి'

లారీల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గోవిందరావుపేట, ఆగస్టు 13 : ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ఇసుక లారీలను ఆపి నిరసన వ్యక్తం చేశారు. ఆగిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9న పస్రా అడవిలో ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను ఫారెస్టు అధికారులు పట్టుకున్నారని తెలిపారు. మంగపేట తహసీల్దార్ ఇచ్చిన అనుమతి పత్రం ప్రకారం మండలం వరకే కాకుండా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా జరుగుతుందన్నారు. ఇలా పట్టుపడకుండా వెళ్లిన ఇసుక లారీలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఇసుక దందాను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిట్టిబాబు, రాజేశ్, ఆదిరెడ్డి ఉన్నారు.

మాజీ మంత్రులను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు



సత్యవతి రాథోడ్‌తో ఎండీ కరీం

కృష్ణకాలనీ, ఆగస్టు 13 : తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎండీ కరీం కలిశారు. మైనార్టీ నాయకులతో కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ మంత్రులకు వివరించారు. జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యుడు రహీం సాదిక్ పాషా, ఎండీ సుభావొద్దీన్, అఫ్జల్, ఇమ్రాన్ ఉన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

గణపురం, ఆగస్టు 13: మండలంలోని చెల్పూర్ పీహెచ్‌సీ పరిధి నగరంపల్లి, లక్ష్మిరెడ్డి పల్లి, గణపురం పీహెచ్‌సీ పరిధి కొండాపూర్ గ్రామ పంచాయతీ వీర్లపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ స్వాతి, ఎంపీడీవో, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎల్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, వైద్యులు అనూష, నర్మద, గౌతమ్, హెచ్‌ఈవో మురళీధర్‌రెడ్డి, పీహెచ్ ఎన్ కృష్ణ వేణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు

ఢీకొని ఒకరు మృతి

చిట్యాల (మొగుళ్లపల్లి), ఆగస్టు 13 : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘ టన మొగుళ్లపల్లి మండల కేం ద్రం శివారు పెద్దవాగు బ్రిడ్జివద్ద మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. టేకుమట్ల మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన ఉద్దమారి తిరుపతి(34) పనుల నిమిత్తం జమ్మికుంటకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మొగుళ్లపల్లి మండల కేంద్ర శివారులో పెద్దవాగు బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న చిట్యాల మండలకేంద్రానికి చెందిన ఓ ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నట్లు చెప్పారు. ఈ ఘటనలో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై అశోక్ పరిశీలించి మృతదేహాన్ని చిట్యాల సివిల్ దవాఖానకు తరలించినట్లు చెప్పారు.

పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ములుగు కలెక్టర్ దివాకర

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగురూరల్, ఆగస్టు 13: ములుగు జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. తంగేడు మైదానంలో చేపడుతున్న వేడుకలో వేదికతో పాటు ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పని సరిగా హాజరు కావాలని ఆదేశించారు.

ములుగులో సీతక్క, భూపాలపల్లిలో పొదెం

భూపాలపల్లి రూరల్/ ములుగు రూరల్ : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో జాతీయ జెండాను మంత్రి సీతక్క, తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పొదెం వీరయ్య ఆవిష్కరించనున్నారు. రాష్ట్రంలోని జిల్లాల వారీగా జెండాను ఆవిష్కరించే ముఖ్యఅతిథుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.

ఉన్నత చదువుపై దృష్టి సారించాలి

ములుగురూరల్, ఆగస్టు13 : విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని ములుగు ఎస్సై-2 రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన బండారుపల్లి మోడల్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. పాఠశాల, కళాశాలల్లో ర్యాగింగ్ నిషేధమని, ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ గుండు రవిప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్

ములుగు, ఆగస్టు13 (నమస్తే తెలంగాణ) : ములుగు ప్రభుత్వ దవాఖానను జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాన పరిసరాలతో పాటు టీ డయాగ్నస్టిక్ సెంటర్, ఓపీ చాంబర్లు, ఐపీ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ సెంటర్‌ను పరిశీలించడంతో పాటు సుమారు గంట పాటు అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి సూపరింటెండెంట్ జగదీశ్వర్‌కు సూచనలు చేశారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇన్‌పేషెంట్ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ వైద్యం కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యం అందించాలని ఆదేశించారు. మెయిన్ గేటు పక్కన వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవోను ఫోన్‌లో ఆదేశించారు. జీపీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి దవాఖాన పరిసరాలను శుభ్రం చేయాలని జీపీ సెక్రటరీ రఘును ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది షిఫ్టుల వారీగా విధులను సక్రమంగా నిర్వహించాలని, వాహనాల పార్కింగ్ నిర్దేశించిన స్థలంలోనే చేయాలన్నారు. ఆదేశాలను బేకాతర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సివిల్ మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఏటూరునాగారం, ఆగస్టు 13 : సివిల్ సర్వీసెస్ పరీక్షలకు (మెయిన్స్, ఇంటర్వ్యూ) హైదరాబాద్ రాజేంద్రనగర్ గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిన ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణకు ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ డీడీ పోచం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్స్ శిక్షణకు సన్నద్ధమవడానికి మోటార్ గైడెన్స్‌తో పాటు ఒక టాబ్, ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష 2024 లో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించి ఉండాలన్నారు. వివరాలకు 7382620487, 7093466985 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, ఆగస్టు 13 : ములుగు కోర్టులో ఒక సంవత్సరం ఒప్పంద ప్రాతిపదికన నాలుగు ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కన్నయ్యలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులతోపాటు రెండు ప్యూన్ పోస్టులకు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5గంటలలోగా స్పీడ్ పోస్టు ద్వారా దరఖాస్తులను పంపించాలని అన్నారు. పూర్తి వివరాలకు కోర్టు వెబ్‌సైట్ http:// district.ecourts.gov. in/mulugu‌ను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేణుక

బీ రేణుక

ఏటూరునాగారం, ఆగస్టు 13 : స్థానిక డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బీ రేణుక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న చిన్న బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న రేణుకను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్, వెంకటయ్య, ఫాతిమా, జ్యోతి, సంపత్, వంశీ, భాస్కర్, విజయలక్ష్మి, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

కార్తీక్ (ఫైల్)

వెంకటాపూర్, ఆగస్టు 13 : కడుపునొప్పి భరించలేక కావటి కార్తీక్ (23) ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కార్తీక్ సోమవారం కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త వేధింపులతోనే వెన్నెల మృతి

గణపురం, ఆగస్టు 13 : భర్త వేధింపులు తట్టుకోలేకే వెన్నెల ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ధర్మారావుపేట గ్రామానికి చెందిన గంపల పద్మ- కోటి దంపతుల చిన్న కూతురు వెన్నెల అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన నోముల రాకేశ్‌ను రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. గత సంవత్సరం నుంచి రాకేశ్ వివాహేతర సంబంధాలు పెట్టుకొని వెన్నెలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. విసుగుచెందిన ఆమె సోమవారం సాయంత్రం అప్పయ్యపల్లిలోని ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తహసీల్దార్ ఎం మురళీధర్‌రావు సమక్షంలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 13 : విద్యుదాఘాతంతో భూపాలపల్లి మండలం గుర్రంపేటకు చెందిన పబ్బోజు కౌసల్య (75) మంగళవారం మృతిచెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డుకు ఉన్న బల్బ్ హోల్డర్ వైర్ తెగి రేకులకు తగిలి ఉంది. గమనించని కౌసల్య బట్టలను షెడ్డు కింద ఇనుప తీగతో కట్టి ఉన్న దండంపై ఆరేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. కౌసల్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇల్లు కూలి వృద్ధురాలికి తీవ్ర గాయాలు

రేగొండ, ఆగస్టు 13 : ఇల్లు కూలడంతో మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి సోమవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో మూడు గంటలకు ఒకసారిగా గోడ కూలి ఆమెపై పడింది. ఈ ఘటనలో లక్ష్మికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే భర్త రాజయ్య బయటికి వచ్చి కేకలు వేయడంతో పక్కనే ఉన్న లింగయ్య, శ్రీను, నాగరాజు వచ్చి మట్టిపెల్లలను తీసి 108 వాహనంలో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చాతి, కాలుకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత వరంగల్‌కు తరలించారు.

కుక్కల స్వైర విహారం

ఏటూరునాగారం, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో పాదచారులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కూరగాయల మార్కెట్, బొడ్రాయి సెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. కరుస్తాయనే భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చీకటి పడగానే ఒక్కరుగా వెళ్లాలంటే జంకుతున్నారు. కుక్కలను కట్టడి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ములుగురూరల్, ఆగస్టు13 : మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు టీజీఎంఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన, ధర్నా చేశారు. ఏండ్ల తరబడి పనిచేస్తున్న తమను ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్స్ చేయాలని డిమాండ్ చేశారు. ఇతర శాఖల్లో చేపడుతున్న బదిలీల మాదిరిగానే మోడల్ పాఠశాలల్లో సైతం బదిలీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఎంఎస్‌టీఎఫ్ బాధ్యులు మహ్మద్ అయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి ఎం మంజుల, ఉపాధ్యాయులు రవిప్రసాద్, తబుస్సుబ్, ఎం కృష్ణ, రుద్రమదేవి, రమేశ్, మంజుల, హనీఫ్, సుధారాణి, శ్రీనివాసాచారి, మాధవి, అపర్ణ, అనురాధ పాల్గొన్నారు.